VISION BHARATH REPORTER
విభారె
VIBHARE TELUGU DAILY
విలేఖరులు కావలెను
గత నాలుగు సంవత్సరాల నుండి వెలువడుతున్న "విభారె" తెలుగు దిన పత్రికకు కర్నూలు జిల్లాలోని అన్ని మండలాల వారీగా అనుభవజ్ఞులైన రిపోర్టర్లు కావలెను.
ఆసక్తిగలవారు వెంటనే సంప్రదించగలరు.
ఆవుల విజయభాస్కర్ రెడ్డి
ఎడిటర్ అండ్ పబ్లిషర్.
MOBILE:
9494498787,9440232308.

# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY

ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
9440232308,9494498787

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 31-10-2023 సంపుటి : 06 సంచిక : 55 పేజీలు : 8 వెల : రూ 3-00

## ఎపి కేబినేట్ భేటీ వాయిదా

**రైలు ప్రమాద ఘటనతో మూడో తేదీకి మార్పు**

**పలు కీలక నిర్ణయాల తీసుకునే అవకాశం**

అమరావతి,అక్టోబర్30(ఆర్ఎన్ఎ):ఆంధ్రప్రదేశ్ మంత్రి వర్గ సమావేశాన్ని మూడో తేదీకి వాయిదా వేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనికి కారణం రైలు ప్రమాదంగా తెలుస్తోంది.. రైలు ప్రమాద ఘటనలో సహాయ కార్యక్రమాలను కొంత మంది మంత్రులు పర్యవేక్షిస్తున్నారు. అందుకే కేబినెట్ సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లుగా తెలిపారు. ఎన్నికలు దగ్గర పడుతున్నందున కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని బావిస్తున్నారు.ఏపీ కార్యనిర్వాహణ రాజధానిగా విశాఖను ప్రకటించిన జగన్ సర్కార్... 2024 ఎన్నికల ముందు వేగంగా అడుగులు వేస్తోంది. న్యాయపరమైన అడ్డంకులు ఉన్నా... విశాఖ నుంచి పరిపాలన చేసేందుకు సిద్ధమువుత ఎన్నారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. సీఎం నివాసంతో పాటు... ముఖ్యమంత్రి క్యాంప్ ఆఫీసును విశాఖకు తరలించి అక్కడి నుంచే పాలన చేయాలని ప్రయత్నిస్తున్నారు. ఇది ఎప్పటి నుంచో అనుకున్నదే అయినా... అడుగులు మాత్రం ముందుకు పడలేదు. కానీ... ఏడాది నుంచి విశాఖకు షిఫ్ట్ అయ్యేందుకు మాత్రం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు సీఎం జగన్. దసరాకు విశాఖకు వెళ్లిపోవాల నుకున్నారు. కానీ... ఏమైందో ఏమో.. మళ్లీ డిసెంబర్‌కు వాయిదా వేసుకున్నారు. డిసెంబర్‌లో విశాఖకు మారిపోతానని సీఎం జగన్ ప్రకటించారు. ఈసారి మాత్రం విశాఖకు మారడం పక్కా అంటున్నాయి వైసీపీ వర్గాలు.డిసెంబర్‌లో విశాఖకు మారుతానన్న సీఎం జగన్ ప్రకటనతో...మూడో తేదీన ఏపీ కేబినెట్ భేటీపై కూడా ఆసక్తి రేగుతోంది. మంత్రివర్గ సమావేశంలో ముఖ్యంగా విశాఖకు రాజధాని తరలింపుపైనే చర్చించే అవకాశం ఉన్నట్టు సమాచారం. డిసెంబర్‌లో విశాఖకు మారుతున్నట్టు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చెప్పారు. కానీ.. ఏ రోజున అన్నది మాత్రం ఇంకా ఫిక్స్ కాలేదు. మరోవైపు... రాజధానిలో వసతులు, సౌకర్యాలపై పరిశీలించేందుకు ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ విశాఖలో పర్యటిస్తోంది. ముఖ్యమంత్రి కార్యాలయం మార్పు, అందుకు అవసరమయ్యే మౌలిక సదుపాయాలకు సంబంధించి అందుబాటులో ఉన్న భవనాలు, నిర్మాణాలను పరిశీలిస్తోంది. సీఎం కార్యాలయం ఎక్కడ ఉండాలి, ఏ శాఖలు విశాఖకు రావాలి, వస్తే ఆయా శాఖల కార్యదర్శులు, విభాగ అధిపతులు ఎక్కడ ఉండాలి అనేది కూడా కమిటీ పరిశీలిస్తోంది. ఈ కమిటీ కూడా కేబినెట్ భేటీలోగా నివేదిక సమర్పించే అవకాశాలు ఉన్నాయి. దీనిపై కూడా మంత్రివర్గ సమావేశంలో చర్చించనున్నారని సమాచారం. ఇక.. ఈనెల మూడో తేదీన మొదటి బ్లాక్‌లో ముఖ్యమంత్రి జగన్ అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరగనుంది. ఈమేరకు సీఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కేబినెట్ సమావేశంలో చర్చించే ప్రతిపాదనలు ఈనెల 27వ తేదీలోపు సాధారణ పరిపాలన విభాగానికి పంపాలని అన్ని శాఖలను ఆదేశించారు. ఉద్యోగాల భర్తీకి సంబంధించి కూడా కొన్ని కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

## నాపై దాడి వెనుక భారీ కుట్ర

**జరిగిన దాడిని చిన్నదిగా చూడొద్దు**

**పవన్ కళ్యాణ్ పీకే కాదు.. కిరాయి కోటిగాడు**

**కమ్మ వర్గంలో ఉగ్రవాదులు తయారయ్యారు**

**వారు టీడీపీని నాశనం చేస్తున్నారు**

**మంత్రి అంబటి రాంబాబు ఆగ్రహం**



అమరావతి,అక్టోబర్30 : తనపై జరిగిన దాడిని చిన్నదిగా చూడొద్దని మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. నాపై దాడి వెనుక భారీ కుట్ర ఉందని అనుమానం వ్యక్తం చేశారు. నాపై దాడి చేసిన వారిలో 9 మందిని గుర్తించి ఆరుగురిని అరెస్టు చేశారని తెలిపారు. అందరూ ఒకే సామాజిక వర్గానికి చెందిన వారే అని స్పష్టం చేశారు. అసెంబ్లీలో నేను భువనేశ్వరిని తప్పుగా మాట్లాడలేదని మంత్రి వివరణ ఇచ్చారు. పవన్ కళ్యాణ్ పీకే కాదు..కిరాయి కోటిగాడు అని అభివర్ణించారు. చంద్రబాబును ఏదైనా అంటే పవన్ మాత్రం రోడ్డు మీద పడుకుంటాడు. ముద్రగడపై దాడి చేసినప్పుడు పవన్ ఖండించాడా అని ప్రశ్నించారు. కమ్మ వర్గంలో ఉగ్రవాదులు తయారయ్యారు. వారు టీడీపీని నాశనం చేస్తున్నారు. టీడీపీ అంత బలంగా ఉంటే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయవచ్చు కదా?. భౌతిక దాడులకు పాల్పడిన ఏ పార్టీకానీ, వ్యక్తిగానీ బ్రతికి బట్ట కట్టలేదు. ముద్రగడ మీద దాడి జరిగినప్పుడు కూడా నేను ఖండించాను. పవన్ కల్యాణ్ అంటే పీకే కాదు.. కిరాయి కోటిగాడు. ఆయన కిరాయి తీసుకుంటాడు కాబట్టి ఖండించడు. ప్రగల్బాలు పలికే పవన్.. చంద్రబాబును ఏదైనా అంటే మాత్రం రోడ్డు మీదకు వచ్చి పడుకుంటాడు' అని ఎద్దేవా చేశారు.

# పదమూడుకు చేరిన రైలు ప్రమాద మృతుల సంఖ్య

**ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 50 మంది క్షతగాత్రులు**

**రైలు ప్రమాద బాధితులను పరామర్శించనున్న సీఎం జగన్**





అమరావతి,అక్టోబర్30 : విజయనగరం రైలు ప్రమాద ఘటన గురించి తెలియగానే తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి.. ఇవాళ ఘటనా స్థలానికి వెళ్లనున్నారు. ప్రత్యేక విమానంలో విశాఖపట్నం చేరుకుని.. అక్కడి నుంచి ప్రమాదం జరిగిన ప్రాంతానికి హెలికాప్టర్‌లో చేరుకుంటారు. అటు నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల పరామర్శకు సీఎం వైయస్ జగన్ వెళ్తారు. విజయనగరం జిల్లాలో కంటాకపల్లి వద్ద ఆదివారం ఘోర రైలు ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. నెమ్మదిగా వెళ్తున్న పలాస ప్యాసింజర్ రైలును వెనక నుంచి రాయఘడ ప్యాసింజర్ రైలు వేగంగా వచ్చి ఢీ కొట్టింది. సిగ్నల్ లేకపోవడంతో భీమాలి-అలమండ స్టేషన్ల మధ్యలో పలాస ప్యాసింజర్ అత్యంత నెమ్మదిగా వెళ్తోంది. ఆ సమయంలో ఈలోపు వెనుక నుంచి విశాఖపట్నం-రాయగడ ప్యాసింజర్ వేగంగా వచ్చి ఢీకొంది. పలాస ప్యాసింజర్‌కు చెందిన గార్డ్ బోగీ ఎగిరి దూరంగా పడింది. దానికి ముందున్న రెండు బోగీలు పక్కకు ఒరిగి, అవతలి ట్రాక్‌పై బొగ్గు లోడ్‌తో ఉన్న గూడ్స్ రైలు ఇంజిన్‌ను ఢీకొని నుజ్జునుజ్జయ్యాయి. రాయఘడ ప్యాసింజర్ ఇంజిన్ పూర్తిగా ధ్వంసమైంది. దాని రెండు బోగీలూ పట్టాలు తప్పాయి. ఘటనలో 13 మంది మృతి చెందగా.. 50 మంది క్షతగాత్రులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటన గురించి తెలిసిన వెంటనే సీఎం వైయస్ జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వైద్య ఆరోగ్య, పోలీసు, రెవిన్యూ సహా ఇతర ప్రభుత్వ శాఖలు సమన్వయంతో వేగంగా సహాయక చర్యలు చేపట్టి, క్షతగాత్రులకు సత్వర వైద్య సేవలు అందేలా చూడాలని జారీచేశారు. ఘటన సంబంధించి వివరాలను ఎప్పటికప్పుడు తనకు నివేదించాలన్నారు. అలాగే సీఎం జగన్ సూచనతో మంత్రి బొత్స ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యల్ని పర్యవేక్షించారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరపు నుంచి ఆర్థిక సాయం ప్రకటన కూడా చేశారు సీఎం వైయస్ జగన్. రైలుప్రమాదంలో మృతిచెందిన ఏపీకి చెందినవారి కుటుంబాలకు రూ.10లక్షలు, తీవ్రంగా గాయపడ్డవారికి రూ.2లక్షల చొప్పున పరిహారాన్ని సీఎం జగన్ ప్రకటించారు. ఇతర రాష్ట్రాలవారు మరణిస్తే రూ.2లక్షలు, తీవ్రంగా గాయపడ్డవారికి రూ.50వేల చొప్పున ఇవ్వాలని అధికారుల్ని ఆదేశించారు. మరోవైపు ఘటన నుంచి సీఎం వైయస్ జగన్‌ను ఫోన్ చేసి ఆరా తీసిన కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్.. సహాయక చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు.

## చంద్రబాబు బెయిల్ పిటీషన్ తీర్పు రిజర్వు

**నేడు తీర్పు వెలువరించనున్న హైకోర్టు**



అమరావతి,అక్టోబర్30 ): టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మధ్యంతర బెయిల్ పిటిషన్ పై తీర్పును ఏపీ హైకోర్టు రిజర్వ్ చేసింది. మంగళవారం ఏపీ హైకోర్టు తీర్పు వెలువరించనుంది. స్కిల్ డెవలప్ మెంట్ కేసులో మధ్యంతర బెయిల్ పిటిషన్ విచారించిన ధర్మాసనం తీర్పు రిజర్వ్ చేసింది. ఆరోగ్య కారణాల రీత్యా మధ్యంతర బెయిల్ ఇవ్వాలని చంద్రబాబు తరపు లాయర్లు కోరారు. చంద్రబాబు తరఫున సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్, సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వర్చువల్ వాదనలు వినిపించారు. చంద్రబాబు వయసు, ఆరోగ్యం దృష్ట్యా బెయిల్ విజ్ఞప్తి పరిశీలించాలనికోరారు. కంటికి ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారన్నారు. చంద్రబాబు 50 రోజులుగా జైలులో రిమాండ్ లో ఉన్న అంశాన్ని న్యాయవాదులు వివరించారు. అనారోగ్య సమస్యలతో చంద్రబాబు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. చంద్రబాబుకు గతంలో ఒక కంటికి ఆపరేషన్ జరిగిందని..రెండో కంటికి ఆపరేషన్ అవసరమని వైద్యులు చెప్పిన అంశాన్ని కోర్టుకు నివేదించారు. హైకోర్టుకు దసరా సెలవులకు ముందు పదే పదే బెయిల్ పిటిషన్లపై వాయిదాలు పడ్డాయి. తర్వాత విచారణ వాయిదా వేశారు. వెకేషన్ బెంచ్ లో విచారణ జరిగినా న్యాయమూర్తి నాట్ బిఫోర్ మీ చెప్పటంతో కేసు వాయిదా పడింది. ఏసీబీ కోర్టు బెయిల్ నిరాకరించడంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం విచారణకు రాగా చంద్రబాబుకు సంబంధించిన మెడికల్ రిపోర్టులను కోర్టు ముందు ఉంచాలని జైలు అధికారులను న్యాయస్థానం ఆదేశించింది. హైకోర్టులో దాఖలు చేసిన పిటీషన్లతో పాటుగా చంద్రబాబు ఆరోగ్యానికి సంబంధించిన నివేదికలను న్యాయవాదులు జత చేసారు. చంద్రబాబు ను అరెస్ట్ చేసిన తరువాత ఈ 50 రోజుల్లో కొత్తగా పురోగతి లేదని ఆయన తరపు న్యాయవాదులు కోర్టుకు నివేదించారు. అదే సమయంలో కొత్తగా ఆరోపణలు కూడా లేవని వివరించారు. చంద్రబాబు నాయుడు మధ్యంతర బెయిల్ పిటిషన్ తో పాటు రెగ్యులర్ బెయిల్ పిటిషన్ కూడా దాఖలు చేశారు. దానిపై వాదనలు వినిపించేందుకు చంద్రబాబు తరపులాయర్ సిద్ధార్థ లూథ్రా సిద్ధమయ్యారు.

## ఆంధ్రప్రదేశ్ పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫీజు గడువు పొడిగింపు

**నవంబరు 10 వరకు పరీక్ష ఫీజు చెల్లించేందుకు అవకాశం**

అమరావతి,అక్టోబర్30( : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పదో తరగతి పబ్లిక్ పరీక్షల పరీక్ష ఫీజు చెల్లింపు గడువును ప్రభుత్వం పొడిగించింది. అక్టోబరు 28వ తేదీతో పరీక్ష ఫీజు గడువు ముగియడంతో తాజాగా నవంబరు 10 వరకు పరీక్ష ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పించినట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకుడు దేవానందరెడ్డి తెలిపారు. నవంబరు 10వ తేదీ వరకు ఎటువంటి అపరాద రుసుం లేకుండా చెల్లించవచ్చని ఆయన తెలిపారు. నవంబర్ 16వ తేదీలోపు అపరాధ రుసుం రూ.50తో, రూ.200తో నవంబర్ 22వ తేదీలోపు, రూ.500తో నవంబర్ 30 వరకు పదో తరగతి పరీక్షల ఫీజు చెల్లించవచ్చని సూచించారు. విద్యార్థుల వివరాలను సంబంధిత ప్రధానోపాధ్యాయులు నవంబరు 10వ తేదీలోపు పంపాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. 2023-2024 విద్యాసంవత్సరానికి వచ్చు ఏడాది మార్చిలో జరగనున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు హాజరయ్యే ప్రథమ, ద్వితీయ సంవత్సరం రెగ్యులర్, ఇర్రెగ్యులర్ విద్యార్థులు నవంబరు 14వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చని ఇంటర్ బోర్డు తెలిపింది. ఈ మేరకు ఇంటర్‌బోర్డు కమిషనర్ నవీన్‌మిత్తల్ షెడ్యూల్ విడుదల చేశారు. కాలేజీల పిన్సిపాళ్ల ద్వారా ఫీజు చెల్లించాలని ఆయన పేర్కొన్నారు. రూ.100 ఆలస్య రుసుంతో నవంబరు 16 %--% 23వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. రూ.500ల ఆలస్య రుసుముతో నవంబరు 25 డిసెంబరు 4 వరకు, రూ.1000 ఆలస్య రుసుముతో డిసెంబరు 6 %--% 13 వరకు, రూ.2 వేల ఆలస్య రుసుంతో డిసెంబరు 15 %--% 20వ తేదీ వరకు ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు.

## జగనన్నకు చెబుదాం - స్పందన కు 195 అర్జీలు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 30 :-స్పందన సమస్యల వేగవంత పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ పుల్లయ్య ఇతర జిల్లాధికారులు జిల్లాలోని వివిధ నలమూలల నుండి వచ్చిన అర్జీదారుల నుండి విజ్ఞప్తులు స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం - స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి వేగవంత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. గతవారం చీఫ్ సెక్రటరీ వీడియో కాన్ఫరెన్స్లో నంద్యాల జిల్లా అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తోందని అభినందించారని.. ఈ మేరకు జిల్లా అధికారులందరికీ కలెక్టర్ అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ మరింత ఉత్సాహంతో పనులు చేపట్టాలని కలెక్టర్ అధికారులను సూచించారు. ఇకనుండి ప్రతి సోమవారం రెండు డిపార్ట్మెంట్లు ప్రజలు అసంతృప్తి చెందిన అంశాలు, రీఓపెన్ అయిన కేసులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. జగనన్నకు చెబుదాం - స్పందన ఈకేవైసీ పై శాఖల వారీగా వారం వారం సమీక్ష నిర్వహిస్తామన్నారు. వేలిముద్రలు,ఐరిష్ పడని వారికి సంబంధిత ఎంపీడీవో, తాసిల్దార్ నుండి డేటా కలెక్ట్ చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. చాగలమర్రి మండలం మల్లెవేముల గ్రామ సచివాలయంలో పంచాయతీ సెక్రెటరీ గైరు హాజరుపై సోకాజ్ నోటీస్ జారీ చేయవలసిందిగా కలెక్టర్ ఆదేశించారు.ఇంకా ఈ కార్యక్రమంలో 195 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ కు అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ వితిన్ ఎస్ఎల్ఏ లోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

# సంపాదకీయం

మంగళవారం 31-10-2023

## హామీలు సరే..నిధుల సంగతేంది?

తెంగాణలో అధికార బీఆర్ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్ పోటీలు పడి ఎన్నికల హామీలు గుప్పించాయి. ప్రధానంగా రైతులు, మహిళలను లక్ష్యంగా చేసుకొని హామీలు ప్రకటించాయి. ఈ రెండు పార్టీలూ ఆ వర్గాల ఓట్లపైనే ఆశలు పెట్టుకున్నాయి. వీరి కోసం ప్రకటించిన హామీలకు వేల కోట్ల రూపాయలు అవసరం అవుతాయని ఆర్థిక నిపుణులు అంటున్నారు. ఈ రెండు పార్టీలు ప్రధానంగా ప్రస్తావించిన రైతుబంధు పథకాన్నే చూస్తే.. ఈ ఏడాది అంటే 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.15,075 కోట్లను బ్జడెట్‌లో కేటాయించింది తెలంగాణ ప్రభుత్వం. ప్రస్తుతం ఎకరానికి ఏడాదికి రూ.పది వేలు చొప్పున రైతులకు రైతుబంధు ఇస్తోంది. ఇదే హామీ విషయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఎకరానికి ఏడాదికి రూ.15 వేలు చొప్పున ఇస్తామని ప్రకటించింది. అంటే ప్రస్తుతం ఇస్తున్నట్లుగా ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతు బంధు అమలు చేయాలంటే దాదాపు రూ.22 వేల కోట్లు కావాలి. అదే బీఆర్ఎస్ మాత్రం వచ్చే ఐదేళ్లలో సాయాన్ని రూ.16వేల కోట్లకు పెంచుతామని హామీ ఇచ్చింది. ఇప్పటికిప్పుడు వచ్చే ఏడాది నుంచి మాత్రం రూ.12వేలు చేస్తామని ప్రకటించింది. ఇలా పెంచేందుకు దాదాపు రూ.18వేల కోట్లకు బ్జడెట్ పెంచాల్సి ఉంటుంది. ఈ లెక్కన రైతుబంధు విషయంలో ఆయా పార్టీలు అధికారంలోకి వచ్చే దాన్ని బట్టి ప్రస్తుతం కేటాయిస్తున్న బ్జడెట్ కంటే అధికంగా రూ.3 నుంచి 7వేల కోట్లు అవసరమవుతాయని స్పష్టంగా తెలుస్తోంది. కాబట్టి, కాంగ్రెస్, బీఆర్ఎస్ మేనిఫెస్టోల ఆధారంగా ఏ మేరకు నిధులు అవసరం అవుతాయో ఇప్పటికే కొన్ని అంచనాలున్నాయి. ఇప్పుడున్న రాష్ట్ర బ్జడెట్ 2023-24 సంవత్సరానికి ప్రతిపాదించిన రూ.2.90 లక్షల కోట్లకు అదనంగా మరో రూ.90వేల కోట్లు అవసరం అవుతాయి. అంత బ్జడెట్ ఎక్కడి నుంచి తీసుకువస్తారనేది అసలు ప్రశ్న. దీనికి సంబంధించి సమాధానం చెప్పాల్సిన బాధ్యత రాజకీయ పార్టీలపై ఉంది. ఇక, కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలలో భాగంగా ప్రస్తుతం బీఆర్ఎస్ ప్రభుత్వం ఇస్తున్న ఆసరా ఫించన్ని రూ.2,016ను రూ.4,000కు పెంచుతామని ప్రకటించింది. ఆసరా పింఛన్ల అర్హత వయసును ప్రభుత్వం 57 ఏళ్లకు తగ్గించింది. దీని ప్రకారం తెలంగాణ వ్యాప్తంగా 53,09,474 మంది పింఛనుదారులున్నారు. ప్రస్తుతం దీని కోసం ఏటా పెడుతున్న ఖర్చు రూ.11,628 కోట్లు. కాంగ్రెస్ ప్రకటించిన గ్యారెంటీలో భాగంగా లెక్కలు వేసుకుంటే రూ.21,237కోట్లు కావాల్సి ఉంటుంది. బీఆర్ఎస్ మాత్రం ఇప్పటికిప్పుడు వచ్చే ఏడాది నుంచి పింఛన్లు రూ.3,016కు పెంచుతామని ప్రకటించింది. తర్వాత నాలుగేళ్లలో రూ.5,00 ఏటా పెంచుతూ రూ.5,016 చేస్తామని ప్రకటించింది. ఈ లెక్కన ఇప్పటికిప్పుడు వచ్చే ఏడాది నుంచి బ్జడెట్‌లో రూ.16,013 కోట్లు కేటాయించాల్సి ఉంటుంది. వికలాంగుల పింఛన్లు మరో రూ.1000 పెంచుతామని కూడా పార్టీలు ప్రకటించాయి. కాబట్టి దానికి అదనపు నిధులు అవసరం. మహాలక్ష్మి పథకం కింద కాంగ్రెస్ పార్టీ ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఇస్తామని ప్రకటించింది. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, గ్యాస్ సిలిండర్ ధర రూ.500కు తగ్గించడం వంటి హామీలున్నాయి. ఈ హామీలు అమలు చేయాలంటే రూ.5-6వేల కోట్లు అవసరం అవుతాయి. వీటన్నిటి దృష్ట్యా, పార్టీలు ప్రకటిస్తున్న హామీలు అమలు చేయాలంటే ఆర్థికంగా పెద్దఎత్తున భారం పడటం ఖాయం. అధికారంలోకి రావాలనే కాంక్షతో హామీలు ఇస్తున్నారే తప్ప ఆదాయం ఎలా వస్తుందనేది ఆలోచన చేయడం లేదని అనిపిస్తోంది. ఇప్పటికే ఎఫ్ఆర్బీఎం పరిమితులు దాటుకుని అప్పులు చేశారు. కొత్త పథకాలు తీసుకువచ్చినా, కొత్త పథకాలు ప్రవేశపెట్టిన అప్పులు మరింత చేయాల్సి ఉంటుంది. ఓటర్లను ఆకర్షించేందుకు ఒకరు ఒక పథకం ప్రకటిస్తే.. మరొక పార్టీ దానికి మరింత హంగులు అద్ది ప్రకటిస్తోంది. ఉదాహరణకు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలలో భాగంగా రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని ప్రకటించింది.ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ ధర రూ.955గా తెలంగాణలో ఉంది. రూ.455 సబ్సిడీని తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే భరిస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. తర్వాత బీఆర్ఎస్ ప్రకటించిన మేనిఫెస్టోలో ఏకంగా గ్యాస్ సిలిండర్ రూ.400కే ఇస్తామని చెప్పింది. ఇలా ఒకరు ఒక పథకం ప్రకటిస్తే.. దాన్ని మరింతగా పెంచి మరొక పార్టీ ప్రకటించడం ఆనవాయితీగా మారింది.నిపుణుల అంచనా ప్రకారం దళితబంధు, బీసీ బంధు వంటి పథకాల కింద లబ్దిదారులందరికీ ఒకేసారి ఇవ్వాలనుకుంటే రూ.2.50లక్షల కోట్లు కావాలి. ఈ ఏడాది ఆర్థిక లోటు రూ.38,235 కోట్లుగా ఉంది. ఈ పరిస్థితుల్లో నీటి పారుదల ప్రాజెక్టులు, ఇతరత్రా ప్రాజెక్టులకు నిధులు కేటాయిస్తూనే కొత్త పథకాలకు నిధులు కేటాయించాలి. కేవలం రూ.4,882 కోట్ల రెవెన్యూ మిగులుతో రూ.లక్ష కోట్ల విలువైన పథకాలను ఏ విధంగా అమలు చేస్తుందనేది ప్రభుత్వం చెప్పాలి. అంతిమంగా అప్పులు చేసి పథకాలు కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అప్పుడు తెలంగాణ రాష్ట్ర బ్జడెట్ దాదాపు రూ.3 లక్షల 80 వేల కోట్లకు పెంచాల్సి ఉంటుంది. రైతుబంధు, ఆసరా పింఛన్లు, దళితబంధు, బీసీ బంధు సహా ప్రస్తుతం ప్రకటించిన హామీలను లెక్కగడితే ఈ అంచనా వచ్చింది. మరి ఈ లోటును ప్రభుత్వం ఎలా అధిగమిస్తుంది? ఒకటి అప్పులు చేయాలి..రెండు ప్రజలపై పన్నుల భారం మోపాలి. ఇప్పటికే ఇబ్బడి ముబ్బడిగా ప్రభుత్వం అప్పులు చేసింది. కాబట్టి ఎవరు అధికారంలోకి వచ్చినా పన్నుల భారం కచ్చితంగా ప్రజలపై ఉంటుందని దీనిని బట్టి అర్థమవుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలో సొంత పన్ను ఆదాయం ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.1.31 లక్షల కోట్ల అంచనాగా ఉంది. ఇది కేవలం అంచనా మాత్రమే. పూర్తిగా వసూలు అవుతుందన్న గ్యారెంటీ లేదు. ఈ నిధులు జీతాలకే సరిపోవు. అలాంటప్పుడు పథకాలకు నిధులు కావాలంటే అప్పులు, పన్నులు, రుణాలపై ఆధారపడాలి. ఇది ప్రజలపై భారం మోపడమే. ప్రభుత్వాలు ఒకచేత్తో పెడుతూ.. మరో చేత్తో లాక్కొంటున్నట్లుగా ఉంది. ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి ఇప్పుడున్న బ్జడెట్‌ను రెండింతలు చేయాలి...మరి దీనికి తగ్గట్టుగా ఆదాయం రెండింతలు చేయగలరా? ఈ ప్రశ్న రాజకీయ పార్టీలు వేసుకుని హామీలు గుప్పిస్తే బాగుండేది!!

## గోనెగండ్ల గ్లోబల్ జీనియస్ స్కూల్ ని డెమోలసిస్ చేయాలి: ఆర్‌వీఎఫ్, ఆర్‌యుఎస్ఎఫ్




గోనెగండ్ల అక్టోబర్ 30 విభారె న్యూస్ ప్రతినిధి:-×గోనెగండ్ల మండలం లో ఉన్న గ్లోబల్ జీనియస్ పాఠశాల ను డేమాలసి చేయాలని రాయలసీమ విద్యార్థి ఫెడరేషన్(ఆర్‌వీఎఫ్,) మరియు రాయలసీమ యునైటెడ్ స్టూడెంట్ ఫెడరేషన్(ఆర్‌యుఎస్ఎఫ్ )విద్యార్థుల సంఘాల ఆధ్వర్యంలో గోనెగండ్ల లోని స్పందన కార్యక్రమం లో ఓఖీా గారికి వినతిపత్రం అందచేయడం జరిగింది.ఈ సందర్భంగా రాయలసీమవిద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు పోతులపాడు నాగరాజు మాట్లాడతూ గోనెగండ్ల లో ఉన్న గ్లోబల్ స్కూల్ పాఠశాలకి సరైన అనుమతులు లేవు విద్య అర్హత లేని ఉపాధ్యాయులతోవిద్యార్థులకు విద్య బోధించడం అని అలాగే రేకులు షెడ్డులో తరగతి గదులు నిర్వహించడం జరుగుతుంది రాబోయే రోజులలో ఎండ తీవ్రంగా ఉంది పాఠశాల కి ఆనుకోని పెట్రోల్ బంక్ ఉంది ఏదైనా జరగరానిది జరిగితే విద్యార్థులు లకు ప్రమాదం ఉంది కాబట్టి గతంలోని డిప్యూటీ కలెక్టర్ గారికి ఫిర్యాదు చేయడం జరిగింది డిప్యూటీ కలెక్టర్ దీనిని చొరవ తీసుకొని ఆ మండలం లో ఉన్నటువంటి ఓఖా తో ఆ పెట్రోల్ బంక్ కి ఆనుకొని ఉన్న కొన్ని రూములు సిజ్ చేయడం జరిగింది. కానీ అధికారుల మాట తుంగలో తొక్కి పట్టించుకోకుండా గ్లోబల్ జూనియర్ స్కూల్ యాజమాన్యం ఆ రూములను వాడడం జరుగుతుంది. దీనిని పరిశీలించి ఆ రూములను డేమాలసిస్ చేయాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో భారీ కార్యక్రమాలను నిర్వహిస్తామని పారు తెలపడం జరిగింది ఈ కార్యక్రమం లో తీబీబట మండల అధ్యక్షులు సురేంద్ర శు రాంజనేయులు రాజు మహేష్ తదితరులు పాల్గొన్నారు

## స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ ను ప్రజలకు సౌకర్యవంతగా ఉండేలా ఏర్పాటు చేయాలి


### అదనంగా మరొక్క ఎటిఎం సెంటర్ ను ఏర్పాటు చేయాలి



కోసిగి, అక్టోబర్ 30(విభారె న్యూస్) కొసిగి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ ను ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సి పి ఐ నాయకులు మేనేజర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కోసిగి సిపిఐ మండల ప్రధాన కార్యదర్శి ఎం,గోపాల్ మండల సహాయ కార్యదర్శి ఓంకార్ స్వామి మాట్లాడుతూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ 30 సంవత్సరాలు క్రితం బ్యాంకు ప్రజలకు ఏలాంటి ఇబంది లేకుండా కిందనే ఉండేది గత కొన్ని సంవత్సరాలుగా బ్యాంకును పైకి మార్చడంతో వికలాంగులు గర్భిణీ స్త్రీలు వృద్ధులు విద్యార్థులు ప్రజలు మెట్టలు ఎక్కడానికి దిగడానికి నానా అవస్థలు ఇబ్బందులు పడుతున్నారు అందువలన ప్రజలందరినీ దృష్టిలో పెట్టుకుని బ్యాంకును కిందకు మార్చాలని వారు డిమాండ్ చేశారు అలాగే ఖాతాదారులను దృష్టిలో ఉంచుకొని అదనంగా ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా మరొక్క ఏటీఎం సెంటర్ ను ఏర్పాటు చేయాలని కోరారు.ప్రజలకు త్రాగునీరు సౌకర్యము, మరుగుదొడ్లు, అందుబాటులో ఉండేలా ప్రజలకు సౌకర్యాలు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు అనంతరం ప్రజల చేత సేకరించిన సంతకాలతో కూడిన పత్రాన్ని డిమాండ్స్ తో కూడిన వినతి పత్రం, స్టేట్ బ్యాంక్ అఫ్ ఇండియా మేనేజర్ గారికి సమర్పించారు ఈ కార్యక్రమంలో ,ఏఐటియుసి మండల కార్యదర్శి రాజేంద్ర,డి హెచ్ పి ఎస్, మండల అధ్యక్షుడు తిక్కయ్య ఏఐవైఎఫ్ మంత్రాలయం ప్రధాన కార్యదర్శి ఎం.రాజు,ఏఐఎస్ఎఫ్ మంత్రాలయం తాలూకా అధ్యక్షుడు ఎస్.ఈరేష్, కోసిగయ్య స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ స్టాఫ్స్ తదితరులు పాల్గొన్నారు

## వరుస దొంగతనాలు కేసుల్లో ముద్దాయిలు అరెస్ట్

### 10 వేలు నగదు, బంగారు, వెండి నగలు స్వాధీనం

కోసిగి,అక్టోబర్ 30 (విభారె న్యూస్) మండల కేంద్రమైన కోసిగిలో ఇటీవల జరిగిన వరుస దొంగతనాలకు సంబంధించిన కేసుల్లో కర్ణాటక రాష్ట్రం, రాయచూరు పట్టణానికి చెందిన సియతలాబ్ ప్రాంతానికి చెందిన సురేష్, పరుశురాం లను అరెస్ట్ చేసి వారి వద్దనుండి నుండి 10 వేలు నగదు, 10 గ్రాములు బంగారు కమ్మలు, 100 గ్రాముల వెండి కాళ్ళ పట్టీలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సతీష్ కుమార్ తెలిపారు. సోమవారంనాడు పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోసిగి లో గ్రామీణ బ్యాంక్ దగ్గర గత మూడు నెలల క్రితం తాళం వేసిన ఇంటి తాళాలు పగలగొట్టి జొరబడి బీరువాను పగలగొట్టి అందులోని 10 గ్రాముల బంగారు, 100 గ్రాముల వెండి పట్టీలు చోరీ చేసినట్లు, అలాగే ఇదే నెలలో కోసిగిలోని గీత మందిరం దగ్గర జరిగిన దొంగతనంలో 10 వేలు నగదును దోచుకునట్లు తెలిపారు.వీరు దోచుకున్న నగదును, వెండిని, బంగారు ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరు కేవలం జల్సా లకోసమే దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు.కోసిగి ప్రజలు ఎవరైనా వేరే ప్రాంతాలకు వెళ్ళేటప్పుడు ఒక్కరూ ఇంట్లో ఉండేటట్లు చూసుకోవాలని, తప్పని పరిస్థితుల్లో పోలీసుల కు సమాచారం ఇచ్చి వెళ్లాలని, సూచించారు

## చట్ట సభల్లో స్థానం డిమాండ్ చేస్తూ నూర్ బాష నేతలు బలప్రదర్శన

### గుంటూరులో నూర్ బాషా దూదేకుల సింహగర్జన

అమరావతి,అక్టోబర్30 చట్టసభల్లో స్థానమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూర్ బాషా (దూదేకుల) ముస్లిం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గుంటూరులో నూర్ బాషా దూదేకుల సింహగర్జన కార్యక్రమం విజయవంతమైంది. వైసీపీ యువనేత జాన్ సైదా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల నుంచి భారీగా నూర్ బాషా సామాజిక వర్గానికి చెందిన ప్రతినిధులు తరలివచ్చారు. చట్ట సభల్లో స్థానం డిమాండ్ చేస్తూ నూర్ బాష నేతలు బలప్రదర్శన చేశారు. నూర్ బాషా నేతలు. ఇంత మంది జనాభా ఉన్నా ఇప్పటి వరకూ చట్ట సభలో చోటు దక్కలేదని వారు పోరాటం చేస్తున్నారు. ముస్లింలకు సీఎం జగన్ అన్ని అవకాశాలు ఇస్తున్నారని.. అందులో మాకు స్థానం కావాలని నూర్ బాషా సామాజిక వర్గానికి చెందిన నేతలు కోరారు. ముస్లింలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న సీఎం జగన్ వచ్చే ఎన్నికల్లో చట్ట సభలో అవకాశం ఇవ్వాలన్నారు నేతలు. ఉమ్మడి ఏపీ నుంచి చట్ట సభల్లో స్థానం కోసం నూర్ బాషా సామాజిక వర్గం ప్రయత్నాలు చేస్తోందని, సీఎం జగన్ తప్ప ఇంకెవరూ మాకు న్యాయం చేయరని ఆ సామాజిక వర్గానికి చెందిన నేతలు అంటున్నారు

## సీ సీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి.



ఎమ్మిగనూరు అక్టోబర్ 30 విభారె న్యూస్.ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి సహకారంతో పట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తామని నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి తెలిపారు. సోమవారం 6వ వార్డులో రూ. 20 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో తాగునీటి పైప్ లైన్లు, సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలు చేపడుతున్నామన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, ఇన్ చార్జ్ లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు స్పందనకు 135 ఫిర్యాదులు ..... జిల్లా ఎస్పీ. కె.రఘువీర్ రెడ్డి .



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 30 :-నంద్యాల జిల్లా బొమ్మల సత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదిదారుల నుంచి నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ కె.రఘువీర్ రెడ్డి 135 ఫిర్యాదులను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండీ విచ్చేసిన ఫిర్యాదిదారుల సమస్యలను జిల్లా ఎస్పీ గారు అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులతో స్వయంగా ఫోన్ లో మాట్లాడి చట్టపరిధిలో ఫిర్యాదిదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని ,స్పందన ఫిర్యాదులను మళ్ళీ పునరావృతం కాకుండా చూడాలని ,స్పందన పిర్యదుల వట్ల నిర్లక్ష్యం గా వ్యవహరించరాదని సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్ లో మాట్లాడి పరిష్కారం చూపాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గారితో పాటు అడిషనల్ ఎస్పీ జి .వెంకట రాముడు , స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ జె.వి సంతోష్ ,సీఐ సూర్యమౌళి ఎస్సై లు రాకేష్ మరియు నరేష్ పాల్గొన్నారు.

## నూతన చర్చి ప్రారంభ వేడుకల్లో పాల్గొన్న మురళీమోహన్ రెడ్డి



కోసిగి, అక్టోబర్ 30 (విభారె న్యూస్) మండల పరిధిలో పెద్దబొంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆర్సీయం చర్చి ప్రారంభ వేడుకలకు సోమవారం నాడు ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు ముఖ్యఅతిథిగా కోసిగి మండల ఇంచార్జీ పి.మురళీ మోహన్ రెడ్డి పాల్గొన్నారు.కర్నూలు మేత్రాసన పాలనా అధికారి పాదర్ అంతోనప్ప చౌరప్ప ,కోసిగి విచారణ గురువులు పాదర్ టోని.ఓ.కాం అద్వరంలో జరిగిన చర్చి ప్రారంభ వేడుకల్లో పాల్గొన్నారు అనంతరం,పి.మురళీ రెడ్డి మాట్లాడుతూ,ఏసుక్రీస్తు దయా అందరి మీద ఉండాలని,పరిశుద్ధ గ్రంథము బైబిలులోని కీర్తనలు మనందరం పాటించాలని సూచించారు.ఈకార్యక్రమంలో జంపాపురం బసిరెడ్డి, గ్రామ నాయకులు గట్టు భీమన్న,లక్ష్మిరెడ్డి, అంజి సంఘ పెద్దలు జేమ్స్,దావీదు, జయరాజ్,హానుమంతు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాజారెడ్డి పై జరిగిన దాడి ముఖ్య ఉద్దేశం గురించి వినతి పత్రం ద్వారా ఫిర్యాదు

**సత్యసాయి జిల్లా ఎస్పీ మాధవ రెడ్డి ఐపీఎస్ కు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ చిలకం మధుసూదన రెడ్డి.**



శ్రీ సత్య సాయి జిల్లా అక్టోబర్ 30 ఈ నెల 20వ తారీకు జనసేన పార్టీ నాయకుడు రాజారెడ్డి పై జరిగిన దాడి గురించి సోమవారం జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్ వి మాధవ రెడ్డి ఐపీఎస్ ని కలిసి దాడి గురించి వివరించి ముఖ్యంగా ఎందుకు దాడి చేశారో ఎవరు దాడి చేపించారో తెలియచేయడం జరిగింది.భవిష్యత్తులో ఇటువంటి దాడులు ధర్మవరంలో ఎక్కువగా జరిగే అవకాశాలు ఉన్నాయని వాటన్నిటిని కట్టడి చేయాలని దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అదేవిధంగా ధర్మవరంలో ఉన్నటువంటి కొందరు అధికారుల మీద,అలాగే ఎవరు దాడులు చేపిస్తున్నారో వారి మీద కూడా కంప్లైంట్ చేశానని అలాగే నాపై పెట్టిన అక్రమ కేసు గురించి కూడా వివరించి వారి మీద కంప్లైంట్ చేశానని దానికి ఎస్పీ కూడా శ్రద్ధగా విని తప్పకుండా చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ఆబు, కొత్తచెరువు మండల అధ్యక్షుడు పూల శివప్రసాద్,కార్యదర్శి బొగ్గరం శీన,కార్యనిర్వాహణ కమిటీ సభ్యులు కోటికి రామాంజి,గొట్లురు జీవి,రవి, సుధాకర్ రెడ్డి,భాషా మరియు తదితరులు పాల్గొన్నారు.

## అనుక్షణం మానవతా కోణంలో పనిచేసే సంస్థ రెడ్ క్రాస్



భీమవరం అక్టోబట్ 30 భీమవరం రెడ్ క్రాస్ పశ్చిమగోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో, రెడ్ క్రాస్ వ్యవస్థాపకులు హెన్రీ డూనేట్ వర్ధంతిని నిర్వహించారు. జిల్లా చైర్మన్ శివరామ బద్రిరాజు మాట్లాడుతూ 1901 ప్రపంచ శాంతి నోబెల్ ప్రైజ్ అందుకున్న సంస్థ రెడ్ క్రాస్ అని అంతేకాకుండా అనుక్షణం మానవతా కోణంలో పనిచేసే సంస్థని అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక కన్వీనర్ చెరుకూడా రంగసాయి మాట్లాడుతూ రక్తం యొక్క ఆవశ్యకతను అవసరాలను తీర్చడంలో రెడ్ క్రాస్ సేవలు ఎనలేనివని కొనియాడారు. సంస్థ, రెడ్ క్రాస్ సీనియర్ లైఫ్ మెంబర్ గోపిశెట్టి మురళి కృష్ణారావు మాట్లాడుతూ విపత్తుల సమయంలో రెడ్ క్రాస్ అందించే సేవలు ఎనలేనివని కొనియాడారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ శీలం డిఎన్ఆర్ కళాశాల ఎన్సిసి మాస్టర్ వీరయ్య, ల్యాబ్ టెక్నీషియన్ శిరీష తదితరుల పాల్గొన్నారు.

## పోలీసు అమరవీరుల సంస్మరణార్థం శ్రీసిటీలో రక్తదాన శిబిరం



(శ్రీసిటీ– పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని శ్రీసిటీ ఫౌండేషన్, నెల్లూరు రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో శ్రీసిటీ పోలీసులు స్థానిక బిజినెస్ సెంటర్‌లో సోమవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శ్రీసిటీ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ జగదీష్ నాయక్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జగదీశ్ నాయక్ మాట్లాడుతూ, సమాజ శ్రేయస్సులో పోలీసుల పాత్ర, వారి త్యాగాల గురించి తెలియచేశారు. ప్రజారోగ్య ప్రాముఖ్యత దృష్ట్యా శ్రీసిటీ యాజమాన్యం సహకారంతో ప్రతి ఏడాది రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ శిబిరంలో రక్తదానం చేసిన పోలీసు సిబ్బంది, శ్రీసిటీ పరిశ్రమల ఉద్యోగులు, విద్యార్థులు, పరిసర గ్రామస్థులకు కృతజ్ఞతలు తెలిపారు. సమాజ శ్రేయస్సులో పోలీసుల పాత్ర, త్యాగాలు వెలకట్టలేనిదంటూ శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో వ్యాఖ్యానించారు. టెక్నాలజీ పరంగా వైద్యరంగం ఎంతో అభివృద్ధి సాధిస్తున్నా, రక్తానికి సంబంధించి ఎలాంటి ప్రత్యామ్నాయాలు లేవన్నారు.

# ఆసత్య ప్రచారాలుతో ప్రగల్భాలు తగదు..

**యంపీపీ ఈరన్న,నాడిగేని నాగరాజు,మహంతేష్ స్వామి.**





కోసిగి,అక్టోబర్ 30 (విభారె న్యూస్) కోసిగి గ్రామ మాజీ సర్పంచ్ ముత్తురెడ్డి ఆదివారం కొంతమంది వైయస్సార్సీపీ కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరినట్లు చౌకబారు మాటలు మానుకోవాలని, అసత్య ప్రచారాలతో ప్రగల్భాలు తగదని కోసిగి మండల యంపీపీ ఈరన్న, నాడిగేని నాగరాజు,మాజీ ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షులు మహంతేష్ స్వామి అన్నారు.సోమవారం స్థానిక యంపీపీ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నిన్న తెలుగు దేశం పార్టీలో చేరినట్లు చూపిన వారు ఏరోజు మాపార్టీ కార్యక్రమంలో పాల్గొన్న లేదని,ఏరోజు పార్టీ కండువా వేసుకోలేదని,గతంలో లోకేష్ యువగళం పాదయాత్రలో ఘర్షణలో పాల్గొనింది అందులో ఉన్నవారు కదా,అది తెలుసుకో ముందు.మీ పార్టీ వారికి కండువా కప్పి,మావాళ్ళని చెప్పుకోవడం సిగ్గుచేటని వారు అన్నారు.సియం జగనన్న, ఎమ్మెల్యే శ్రీ వై బాలనాగి రెడ్డి పాలనలో వైయస్సార్సీపీ కార్యకర్తలు సంతోషంగా ఉన్నారని,2024లో గెలిచేది మళ్ళీ వైకాపా ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో హోళగుంద కోసిగయ్య,ముకుంద కృష్ణ మూర్తి, వందగల్లు లక్ష్మయ్య, కాంట్రాక్టు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగం కోసమని వెళ్లి....తిరిగి రాని లోకాలకు రైలు యాక్సిడెంట్ లో అగసనూర్ యువకుడు మృతి



కోసిగి, అక్టోబర్ 30 (విభారె న్యూస్) ఉద్యోగం కోసమని వెళ్లి విజయనగరం జిల్లా కొత్త వలస మండలం నారాయణ పాలెం బీమిలి మధ్య విశాఖ నుండి పలాస వెళుతున్న ప్యాసింజర్ రైలుకు జరిగిన ప్రమాద దుర్ఘటన లో కోసిగి మండలం అగసనూర్ గ్రామానికి చెందిన యువకుడు దుర్మరణం చెంది తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చిన సంఘటన జరిగింది వివరాలు పరిశీలిస్తే. విజయనగరం జిల్లా కొత్తవలస మండలం నారాయణ పాలెం భీమిలి మధ్య విశాఖ నుండి పలాస వెళుతున్న ప్యాసింజర్ రైలును అదే మార్గంలో వెళ్తున్న విశాఖ ప్యాసింజర్ రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే 8 మంది మృతి చెందిన విషయం ప్రజలకు తెలిసిందే ,మృతి చెందిన వారిలో కర్నూలు జిల్లా కోసిగి మండల పరిధి అగసనూరు గ్రామానికి చెందిన చాకలి తాయప్ప అనే యువకుడు కూడా ఉన్నాడు. ఈ సంఘటన లో 40 మందికి తీవ్ర గాయాలయ్యాయి. కోసిగి మండలం పరిధిలోని అగసనూరు గ్రామానికి చెందిన చాకలి పాలన్న కుమారుడు చాకలి తాయప్ప (20) అనే యువకుడు విజయనగరానికి వెళ్తుండగా మధ్య మార్గంలో ఒక రైలు మరొక రైలు రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. చాకలి తాయప్ప పర్సులో ఉన్న ఆధార్ కార్డు చూసి అందులో ఉన్న తండ్రి ఫోన్ నెంబర్కు అక్కడి ఉన్న కానిస్టేబుల్ ఫోన్ చేయడం తో తండ్రి పాలన్న కు ఈ విషయం తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు లబోదిబ్బుమంటూ ఏడుస్తూ కన్నీరు మున్నీరయ్యారు. చాకలి పాలన్న, చాకలి నాగమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు,మృతుడు తాయప్పకొన్ని రోజులు మంత్రాలయంలో ఉండి ఇటీవలే ఉపాధి కోసమని వెళ్లి నట్లు తెలిసింది. మృతునికి ఇంకా వివాహం కాలేదు మృతునికి తమ్ముడు భీమా, చెల్లి సంగీతలు ఉన్నారు. ఈ సంఘటన తో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.విషయం తెలుసుకున్న మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, ఇంఛార్జ్ మురళీమోహన్ రెడ్డి లు సంతానం తెలియజేస్తూ మృతుడి కుటుంబానికి అన్ని రకాల అండగా ఉంటామని తెలిపారు.

# విద్యార్థులకు సొంత హాస్టల్ భవనాన్ని నిర్మించండి...




**ఖాళీగా ఉన్నటువంటి పాత మున్సిపాలిటీ భవనాన్ని విద్యార్థులకు హాస్టల్ గా కేటాయించాలి ఎన్.ఎస్.యు.ఐ డిమాండ్..**

విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- అక్టోబర్ 30 డోన్ లో ఇంటర్ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల మరియు ఐటిఐ లో చదువుతున్నటువంటి విద్యార్థులకు సొంత హాస్టల్ భవనాన్ని నిర్మించాలని, ఖాళీగా ఉన్నటువంటి పాత మున్సిపల్ కార్యాలయం విద్యార్థులకు హాస్టళ్లకు కేటాయించాలని జిల్లా నాయకులు తెలుగు విజయ్ కుమార్ నియోజకవర్గ నాయకులు సునీల్ ,మధు, అజయ్, చరణ్ డిమాండ్ చేశారుడోన్ కేంద్రంగా ఉన్నటువంటి ప్రభుత్వ జూనియర్ కళాశాల డిగ్రీ కళాశాల మరియు ఐ.ఐ.ఐ లో చేరడానికి నియోజకవర్గము నుండి ఎంతోమంది విద్యార్థులు చదువుకోడానికి వస్తున్నప్పటికీ వారికి హాస్టల్ వసతులు సరిగ్గా లేకపోవడంతో చాలామంది విద్యార్థులు ప్రైవేట్ కళాశాలలో చదవలేక ప్రభుత్వ హాస్టల్లో సరిగ్గా లేక విద్యను చాలిస్తున్నారు. ఈ విషయమై రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి డోన్ నియోజకవర్గం ఎమ్మెల్యే అయినటువంటి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లడం జరుగినప్పటికీ ప్రయోజనం లేకోకుండా పోయింది.ఇప్పుడు ఉన్నటువంటి ప్రైవేట్ హాస్టల్ భవనాలలో ఎటువంటి మౌలిక సదుపాయాలు లేకపోగా ఊరికి చివరన ఎస్సీ, ఎస్టీ హాస్టల్ ఉంచడం కుల వివక్ష చూపుతున్న విధంగా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.అద్దె గోడౌన్ లో ఉన్నటువంటి హాస్టళ్లకు వేల రూపాయలు అద్దెలు చెల్లించినప్పటికీ అక్కడ తాగడానికి మంచినీళ్లు కూడా ఏర్పాటు చేయలేని పరిస్థితి నెలకొంది వీధిలైట్లు లేని విద్యార్థులు రాత్రిపూట బిక్కు బిక్కు మంటూ భయంతో నిద్రిస్తున్నారు .డోన్ నియోజకవర్గం లో తారాస్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని చెప్పుకుంటున్నటువంటి నాయకులు ఒక్కసారి ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్ సందర్శించాలని తర్వాత వారు ఏ మాత్రం అభివృద్ధి చేశారు ఆత్మవిమర్శన చేసుకోవాలన్నారు.ఇప్పటికైనా డోన్ నియోజకవర్గం ఎం.ఎల్.ఏ మరియు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి విద్యార్థుల పట్ల కనికరించి మూసివేసినటువంటి ఖాళీగా ఉన్న మున్సిపల్ కార్యాలయాన్ని విద్యార్థుల హాస్టల్ కు కేటాయించాలని లేనిపక్షంలో విద్యార్థులను వారి తల్లిదండ్రులను పెద్ద ఎత్తున సమీకరించి ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎస్ బి ఐ నాయకులు మధు, జగన్, సురేంద్ర, దస్తగిరి, అభి లు పాల్గొన్నారు..

# ముఖ్యమంత్రి జగన్ తోనే సామాజిక న్యాయం

**డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ**





తాడేపల్లిగూడెం,30 గత 30 ఏళ్లుగా అన్ని సామాజిక వర్గాలకు సముచిత ప్రాధాన్యతనిస్తూ సమతుల్యతతో తాను రాజకీయాల్లో కొనసాగుతున్నానని తాడేపల్లిగూడెం శాసనసభ్యులు, రాష్ట్ర ముఖ్యమంత్రి (దేవదాయ ధర్మాదాయ శాఖ) కొట్టు సత్యనారాయణ అన్నారు. 1994లో రాజకీయాల్లో ప్రవేశించిన నాటి నుంచి స్థానిక సంస్థల్లో గాని, నామినేటెడ్ పదవుల్లో గాని తాను అన్ని సామాజిక వర్గాలకు సమాన ప్రాతినిధ్యం కల్పిస్తూ వచ్చానని చెప్పారు. మున్సిపాలిటీ అయినా, మండల పరిషత్ అయినా, జిల్లా పరిషత్ అయినా, మార్కెట్ కమిటీ అయినా.... ఇలా ఏదైనా సరే పదవులు ఇచ్చేటప్పుడు అన్ని సామాజిక వర్గాలను దృష్టిలో పెట్టుకుని సామాజిక సమతుల్యతతో కేటాయించడం జరుగుతుంది అన్నారు. ఈ కారణంగానే ఎప్పుడు ఏ ఒక్కరితోనూ వేలెత్తి చూపించుకోని విధంగా అన్ని సామాజిక వర్గాలను కలుపుకుని 30 సంవత్సరాలుగా తాను రాజకీయాల్లో కొనసాగుతున్నాను అన్నారు. తాడేపల్లిగూడెం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం లో పదవులు పొందిన పలువురు ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ ను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఏఎంసీ చైర్మన్ గా నియమితులైన ముప్పిడి సంపత్ కుమార్, వైస్ చైర్మన్ గా నియమితులైన చోడగిరి చినబాబు, డైరెక్టర్లుగా నియమితులైన నున్న శ్రీ నాగలక్ష్మి, గార్లపాటి వీరకుమార్, కర్రి వరహాల రెడ్డి మంత్రి కొట్టును కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1994లో రాజకీయాల్లోకి వచ్చిన నాటి నుంచి సమాజంలో అన్ని వర్గాలను కలుపుకుంటూ అన్ని వర్గాలకు సమాన ప్రాతినిధ్యం కల్పిస్తూ అన్ని బెరీజి వేసుకుని సమాన ప్రాతినిధ్యం కల్పించడం జరిగిందన్నారు. 1995 నుంచి ఇప్పటివరకు జరిగిన అన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లోను సామాజిక సమతుల్యత పాటిస్తూ అభ్యర్థులను ఎంపిక చేసి గెలిపించడం జరిగిందన్నారు. తాను పదవిలో లేకపోయినా ఒక బీసీ వర్గానికి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇవ్వడం జరిగిందన్నారు. ఆ తర్వాత ఒక మహిళకు, ఇప్పుడు ఒక ఎస్సీ వర్గానికి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని కేటాయించిన చరిత్ర తమకుందన్నారు. అదే తెలుగుదేశం హయాంలో అయితే అగ్రవర్ణాల పెత్తనం తప్ప బడుగు బలహీన వర్గాలకు ఏనాడూ చోటు కల్పించలేదు అన్నారు. ఏఎంసీ చైర్మన్ గా నియమించబడిన సంపత్ గత 30 సంవత్సరాలుగా రాజకీయాల్లో తనతోనే ఉన్నాడని, నమ్మినవారికి అన్ని విధాల అండదండలు ఇచ్చి పైకి తీసుకొచ్చే విధంగా చేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బడుగు బలహీన వర్గాల తో పాటు కాపు సామాజిక వర్గానికి కూడా న్యాయం చేస్తూ ముందుకు సాగుతున్నాను అన్నారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50% పదవులు ఇచ్చిన ఘనత సాధించారన్నారు. అలాగే అందులోనూ మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. 136 బీసీ కులాలకు 56 కార్పొరేషన్ లు ఏర్పాటు చేసి వారి అభ్యున్నతికి వైకాపా ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. పెత్తందారులు పార్టీ అయిన తెలుగుదేశం లో బడుగు బలహీనవర్గాలంటే చిన్నచూపు ఉందన్నారు. 2024 ఎన్నికలు పెత్తందారులకు, పేదలకు మధ్య జరిగే క్లాస్ వార్ అని పేర్కొన్నారు. గత నాలుగున్నర ఏళ్లుగా వైకాపా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేసిన సామాజిక న్యాయాన్ని చాటుతూ సామాజిక సాధికార యాత్ర పార్టీ చేపట్టిందన్నారు. ఉప ముఖ్యమంత్రి పదవి నుంచి క్రింది స్థాయి వరకు సామాజిక న్యాయాన్ని పాటించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దేశానికి ఆదర్శంగా నిలిచారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలియజేశారు.

# విద్యార్థులకు కాస్మోటిక్స్ మెస్ చార్జీలు పెంచండి

**పి.డి.ఎస్.యు జిల్లా అధ్యక్షులు ఎస్.ఎండి రఫీ,జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నాగరాజు**




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 30 :-ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పిడి ఎస్ యు)జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నంద్యాల పట్టణంలో పద్మావతి సర్కిల్ వద్ద పి.డి.ఎస్.యు ఆధ్వర్యంలో భిక్షాటన కార్యక్రమం చేపట్టారు .ఈ సందర్భంగా పి డి.ఎస్.యు. జిల్లా అధ్యక్షులు ఎస్.ఎండి రఫీ,జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ హాస్టల్ లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి, విద్యార్థులు కు సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు..పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థులకు ఇస్తున్నటువంటి కాస్మోటిక్ మెస్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ హాస్టల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించాలని తెలిపారు.ప్రభుత్వ హాస్టళ్లలో ఖాళీగా ఉన్న వార్డెన్, వాచ్ మెన్,కమాటి,వంట మనిషి పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు .తక్షణమే విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో పి డి ఎస్ యు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పిడిఎస్ యు జిల్లా నాయకులు బాలాజీ, నంద్యాల పట్టణనాయకులురవి,వంశీ,వినయ్,మనోహర్,ఎ౼రి,నవీన్,రవీంద్ర,బాలు, రమణ,విజయ్,మరియు తదితరులు పాల్గొన్నారు.

## డోన్ మండల సర్వేయర్‌పై విచారణ జరిపించండి :సిపిఐ జిల్లా నాయకుల డిమాండ్




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 30 :-డోన్ మండల రెవిన్యూ సర్వేయర్ జగదీష్ అవినీతికి అంతులేకుండా పోయిందని రైతులను బెదిరిస్తూ ఇబ్బందుల కు గురి చేస్తున్నాడని జిల్లా కలెక్టర్ గారికి సోమవారం నాడు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్. సిపిఐ పట్టణ కార్యదర్శి కే ప్రసాద్ సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి జి సోమన్న తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. నంద్యాల జిల్లా డోను మండలంలో 44 గ్రామాలు తో పాటు 32 వార్డులతో మున్సిపాలిటీ ఉన్నదని రాష్ట్ర ప్రభుత్వం చాలా ప్రతిష్టాత్మకంగా జగనన్న శాశ్వత భూహక్కు శాశ్వత భూ రక్ష పథకం ద్వారా గ్రామాలలో రైతుల భూములను రీ సర్వే జరుగుతున్న సర్వేలలో మండల సర్వేయర్ జగదీష్ అవినీతి అక్రమాలకు పాల్పడుతూ రైతుల భూములను రీసర్వే చేయకుండా లంచాలు ఇచ్చిన వారికి మాత్రమే రీసర్వ్ చేస్తూ రైతులను ఇబ్బందులు గురిచేస్తున్నారని విమర్శించారు.

## మున్సిపాల్ స్పందన కు ఒకే ఒక్క అర్జీ




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 30-:-వివిధ సమస్యల పరిష్కారం కోసం స్పందన ద్వారా ప్రజల నుంచి అందే వినతులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సకాలంలో వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్ అన్నారు. పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో పట్టణంలో ఉన్న ప్రజల నుంచి వివిధ సమస్యలపై ఆయన వినతులను స్వీకరించారు. వివిధ అంశాలపై ఒకే ఒక్క అర్జీ అందిందని వెంకట దాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ జూనియర్ అసిస్టెంట్ నిరీక్షణ. సిబ్బంది పాల్గొన్నారు.

# జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

## డాక్టర్ అంకి రెడ్డి హెల్త్ ఆఫీసర్




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 30:- . జగనన్న ఆరోగ్యసురక్ష క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకి రెడ్డి అన్నారు . ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకి రెడ్డి పేర్కొన్నారు . సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పట్టణంలో 47 సచివాలయాలలో సోమవారం నాటికి 38.సచివాలయాల యందు జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహించామని తెలిపారు. 38 సచివాలయ పరిధిలో 18.894మంది ఓపీలు తీసుకున్నారని వారికి అన్ని రకాల ప్రాధమిక పరిక్షలతో పాటు ఉచితంగా వారికి కావాల్సిన మందులు పంపిణీ చేసామని అన్నారు. ఇంకా 9 సచివాలయాలు మిగిలి ఉన్నాయని వాటిని నాలుగో తేదీ లోపల కంప్లీట్ చేస్తామని తెలిపారు .హరిజన వాడ అర్బన్ హెల్త్ సెంటర్ ను. అలాగే ఎన్ జీ ఓ కాలనీ ఆత్మకూర్ బస్టాండ్ వద్ద ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్లను సోమవారం ఆయన పరిశీలించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్ర మాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు . జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఏర్పాటుచేసిన హెల్ప్ డెస్క్ స్పాట్ రిజిస్ట్రేషన్, కేస్ షీట్ కౌంటర్, ల్యాబ్ టెస్టింగ్ కౌంటర్, మందులు పంపిణీ కౌంటర్లను పరిశీలించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరాతీశారు . ఈ కార్యక్రమంలో . మెప్మా పీడీ భాస్కర్ రెడ్డి . శానిటేషన్ సూపరైజర్ లక్ష్మీనారాయణ. శివ ప్రసాద్ రెడ్డి . పలువురు డాక్టర్లు. సచివాలయ హెల్త్ సెక్రటరీలు . ఆశా వర్కర్ల. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# స్పందనలో వచ్చిన 104 ఫిర్యాదులకు విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం...

## - జిల్లా ఎస్పీ శ్రీ జి. కృష్ణ కాంత్.



కర్నూలు జిల్లా ప్రతినిధి అక్టోబర్ 30స్పందన కార్యక్రమానికి 104 ఫిర్యాదులు.స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి , పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించిన జిల్లా ఎస్పీ.జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియం పునర్ నిర్మాణంలో ఉన్న కారణంగా కర్నూలు నగరంలోని (కర్నూలు 2 టౌన్ పిఎస్ ప్రక్కన ) కొత్తపేట దగ్గర ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్పీ జి. కృష్ణ కాంత్ ఐపియస్ సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి స్పందన కార్యక్రమంకు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్పందన కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 104 ఫిర్యాదులు వచ్చాయి.వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ...1) విజయనగరం జిల్లా గరివిడి మండలం కన్సల్టెన్సీ కి చెందిన సువ్వారి గీతావాణి, సువ్వారి కామేశ్వరరావులు నాకు వి అర్ ఓ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి రూ. 7 లక్షలు తీసుకొని ప్రభుత్వ కార్యాలయాల్లో శిక్షణ ఇప్పించి, ఏడాది పాటు జీతాలు ఇచ్చి మోసం చేశారని ఆదోని పట్టణం , కార్వన్ పేట కు చెందిన లక్ష్మణ్ ఫిర్యాదు చేశారు. 2) కెనాల్ మరమ్మత్తులు చేయడానికి ప్రొద్దుటూరు కు చెందిన పుట్టా రమణయ్య అనే వ్యక్తి నా 4 ఎకరాల పొలంలో కాంక్రీటు పేట్లు, ఇసుక, కంకర వేసుకుంటానని 3 సం.రాల పాటు లీజు తీసుకొని సం.రానికి రూ. 35 వేలు ఇస్తానని చెప్పి పూర్తి అయిన తర్వాత డబ్బులు ఇవ్వకుండా మోసం చేశాడని వెల్దుర్తి , చెరుకుల పాడు గ్రామానికి చెందిన రామంజనేయులు ఫిర్యాదు చేశారు. 3)ఎమ్మిగనూరు కు చెందిన ఇబ్రహీం మా పొలంలోని 70 క్వింటాళ్ళ పత్తి కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా చెల్లని చెక్కు ఇచ్చి మోసం చేశాడని ఎమ్మిగనూరు కు చెందిన సంధ్య ఫిర్యాదు చేశారు.4) నా పాన్ కార్డు నెంబర్ తో నాకు తెలియకుండా హైదారబాద్ లో తెలియని వ్యక్తి లోన్ యాప్ లో రూ. 34 వేలు రుణం తీసుకొని నా ఫోటో,నా పేరు ను కూడా మార్ఫిడి చేసి లోన్ తీసుకున్నాడని లోన్ కట్టకుండా ఉండడంతో లోన్ ఇచ్చిన వాళ్ళు నా పాన్ నెంబర్ ఆధారంగా నాకు నోటీసులు ఇస్తూ, ఫోన్లు చేస్తున్నారని కర్నూలు,గణేష్ నగర్ కు చెందిన కృష్ణ ఫిర్యాదు చేశారు. 5)విశాఖపట్నం కు చెందిన అంకం నరేష్ కుమార్ అనే వ్యక్తి అమరావతి హెడ్ ఆఫీసులో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి నా దగ్గర నుండి రూ.3 లక్షల 50 వేలు తీసుకొని మోసం చేశాడని కర్నూలు కు చెందిన హరిబాబు ఫిర్యాదు చేశారు. 6) నా ఫోటో షాపు దగ్గరకు అప్పుడప్పుడు వస్తూ నన్ను పరిచయం చేసుకుని రహమ్ తుల్లా, కృష్ణమోహన్,నాగరాజు లు ఎపి,తెలంగాణలో పెద్ద మొత్తంలో డబ్బులు అప్పుగా తీసుకుని ఎక్కువ వడ్డీ ఇస్తామని ఆశ చూపి నా నుండి రూ. 2 లక్షల 40 వేలు తీసుకుని మోసం చేశారని కర్నూలు, అబ్దుల్లా ఖన్ ఎస్టేట్ కు చెందిన మనోహర్ ఫిర్యాదు చేశారు.స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా జిల్లా ఎస్పీ జి. కృష్ణ కాంత్ ఐపియస్ హామీ ఇచ్చారు.ఈ స్పందన కార్యక్రమంలో డిఎస్పీ శ్రీనివాసులు , లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, సిఐలు పాల్గొన్నారు

## జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించాలి

ఎమ్మిగనూరు అక్టోబర్ 30 విభారె న్యూస్. నియోజకవర్గంలో పనిచేస్తున్న జర్నలిస్టులుఅందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలని జర్నలిస్ట్ అసోసియేషన్ అఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్) అధ్యక్ష కార్యదర్శులు అబ్దుల్ రజాక్ సుధాకర్ లు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎమ్మార్వోఆంజినేయులుగారికివినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు వారదిగా ఉన్న జర్నలిస్టు లకు ఇంటి స్థలాలను ఇవ్వాలని అందుకు ఎలాంటి నిబంధనలు లేకుండా అక్రిడేషన్ తో సంబంధం లేకుండా ఇంటి స్థలాలు కేటాయించలేని వారు కోరారు.



## కానిస్టేబుల్ కుటుంబానికి తోటి బ్యాచ్ పోలీసుల చేయూత.

**- తోటి బ్యాచ్ (1998 బ్యాచ్) పోలీసులు స్పందించి ఆదుకోవడం అభినందనీయం :- జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్.**

కర్నూలు జిల్లా ప్రతినిధి అక్టోబర్ 30 విభారె న్యూస్.1 లక్ష 10 వేల నగదు బాధిత కుటుంబానికి అందజేత.1998 బ్యాచ్ కు చెందిన ఎఆర్ కానిస్టేబుల్ లాలుషావలి (ఎఆర్ పిసి 1723)కర్నూలు ఆర్మడు రిజర్వుడు లో పని చేస్తూ 2023 అక్టోబర్ 9 న అనారోగ్యముతో మృతి చెందారు. ఈయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు.ఈ సంధర్భంగా తమ తోటి కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచి ఆదుకునేందుకు 1998 బ్యాచ్ పోలీసులు తమ వంతు సహాయంగా సేకరించిన మొత్తం రూ. 1 లక్ష 10 వేల నగదును సోమవారం కర్నూలు టు టౌన్ పియస్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ ఐపియస్ చేతుల మీదుగా ఎఆర్ కానిస్టేబుల్ భార్య షాహిని కి అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆర్ ఐ వి.యస్ రమణ ,1998 బ్యాచ్ పోలీసులు,ఎఆర్ కానిస్టేబుల్ లాలు షావలి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# నేడు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 30:- మున్సిపల్ కౌన్సిల్ సదారణ సమావేశం ఈ నెల 31 వతేదిన జరగనున్న నేపథ్యంలో ప్రదాన ఎజెండా సిద్దమయిందని కమిషనర్ రవి చంద్రా రెడ్డి పేర్కొన్నారు. కమిషనర్ రవి చంద్రా రెడ్డి సోమవారం మున్సిపల్ కార్యాలయం యందు మాట్లాడుతూ నంద్యాల అభివృద్ధికి తగు విధంగా అజెండా ను పొందుపరచడం జరిగిందన్నారు. ఛైర్ పర్సన్ మాబున్నిసా అధ్యక్షతన జరిగే సమావేశానికి కౌన్సిలర్లు అధికారులంతా హజరు కావాలని కోరారు . అజెండా పత్రాలను ప్రజాప్రతినిధులకు కౌన్సిలర్లకు పంపించామని అన్నారు.

# సెంచరీకి దగ్గరగా ఉల్లి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 30:- ఉల్లి ధరలు సెంచరీ కొట్ట డానికి సిద్ద మౌవుతున్నాయి . మొన్నటి వరకు టమాటా.. ఇప్పుడు ఉల్లి.. ధరలు భారీగా పెరిగాయి. ఉల్లి ధరలు పెరుగుతుండటం సామాన్యుల్లో మళ్లీ ఆందోళన మొదలైంది. దీనికి తోడు పండగల సీజన్ కూడా ప్రారంభం కావడం.. అదే సమయంలో ఉల్లి ధరలు ఆకాశం వైపు చూస్తుండటంతో సామాన్యులు ఆందోళనలో ఉన్నారు. డిమాండ్ కు తగ్గ సరఫరా లేకపోవడంతో ఉల్లి రేట్లు అమాంతం పెరిగాయని చెబుతున్నారు. రానున్న రోజుల్లో రేట్లు మరింత భారీగా పెరుగుతాయంటున్నారు .ఏపీతో పాటూ దేశమంతటా టమాటా ధరలుచుక్కలు చూపించాయి. కేజీ ధర ఏకంగారూ.150 నుంచి 200 వరకు వెళ్లింది. ఆతర్వాత రేట్లు దిగిరావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. టమాటా ధరల గురించిఇప్పుడు ఎందుకు అనుకుంటున్నారా.. తాజాగాఉల్లి ధరలు కూడా అదే బాటలోనడుస్తున్నాయి. ఏపీలో ఉల్లి ధరలు క్రమంగాపెరుగుతున్నాయి. జూన్, జులై నెలల్లో కిలోరూ.20 నుంచి రూ.25 ఉంటే.. ఆగస్టు, సెప్టెంబర్ కిలో రూ 35.వరకు పలికింది. ప్రస్తుతం మార్కెట్ లో 50-నుంచి 70. వరకు పలుకుతోంది. దిగుబడులు తగ్గి పోవడంతో ఉల్లి ధరలు అమాంతం పెరిగాయని వ్యాపారస్తులు అంటున్నారు. ప్రభుత్వం గతంలో మాదిరిగా రైతు బజారు యందు సబ్సిడీ కింద ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

## శ్రీమతి ఇందిరాగాంధి వర్ధంతి,సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి కార్యక్రమములు.



శ్రీమతి ఇందిరాగాంధి గారు సర్దార్ వల్లభాయి పటేల్ గారు

కర్నూలు జిల్లా ప్రతినిధి అక్టోబర్ 30 విభారె న్యూస్.జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయం కళా వెంకట్రావ్ భవనం కర్నూలు నందు ఈ రోజు ఉదయం 9:30 గంటలకు భారత తొలి మహిళా ప్రధాని, భారతరత్న శ్రీమతి ఇందిరా గాంధి 39 వ వర్ధంతి, భారత తొలి ఉప ప్రధాన మంత్రి తొలి హోమ్ మంత్రి, ఉక్కు మనిషి, భారతరత్న సర్ధార్ వల్లభాయ్ పటేల్ 148 వ జయంతి కార్యక్రమములు జరుగును.ఈ కార్య క్రమమునకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కే బాబురావు అధ్యక్షత వహించెదరు.ముందుగా పార్టీ కార్యాలయం నందు గల శ్రీమతి ఇందిరా గాంధి మరియు సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటములకు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం స్థానిక రాజ విహార్ సెంటర్ నందలి శ్రీమతి ఇందిరా గాంధీ కాంస్య విగ్రహమునకు పూల మాలలు వేసి నివాళులర్పించబడును.ఈ కార్యక్రమమునకు కాంగ్రెస్ నాయకులు అనుబంధ సంస్థల నాయకులు పార్టీ కార్యకర్తలు అభిమానులు హాజరు కావలసినదిగా కోరుచున్నాము.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190